స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా స్పీకర్

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

వికారాబాద్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరగనున్న వేడుకలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించనున్నారు. ఈ మేరకు మంగళవారం సీఎస్ శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

పాతాళంలోనే గంగమ్మ

వర్షాలు కురిసినా పెరగని భూగర్భజలాలు

భూగర్భ జలాల పరిస్థితి (మీటర్లలో) జిల్లా	జులై 2023	జులై 2024	తగ్గుదల శాతం
రంగారెడ్డి	8.96	13.08	-4.12
వికారాబాద్	9.74	12.61	-2.87
మేడ్చల్	9.48	11.99	-2.51



ఈ ఏడాది అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసినా ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా సగటు వర్షపాతం నమోదైతే జలాశయాలు నిండి భూగర్భజలాలు పెరుగుతాయి. కానీ ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మూడు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనా (సగటుకు 20శాతం తక్కువ లేదా ఎక్కువ కురిసినా సాధారణ వర్షపాతం కింద లెక్కిస్తారు) భూగర్భజలాలు మాత్రం ఆ స్థాయిలో పెరగలేదు. రాష్ట్రంలో అతి తక్కువ భూగర్భజాలాలు నమోదైన జిల్లాల్లో మూడు జిల్లాలు(రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్) ఉండటం గమనార్హం.

గతేడాది కంటే 4.12మీటర్ల లోతులో నీటి మట్టం

- మూడు జిల్లాల్లోనూ నిండని జలాశయాలు
- వానాకాలం సాగుపై తీవ్ర ప్రభావం
- సగటు కంటే తగ్గిన సాగు విస్తీర్ణం
- రంగారెడ్డి జిల్లాలో కేవలం 45 శాతమే సాగు

(రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/వికారాబాద్/మేడ్చల్,ఆంధ్రజ్యోతి)

రంగారెడ్డి జిల్లాలో పరిస్థితి దారుణంగా ఉంది. ఆగస్టు నెల దాదాపు సగం గడిచినప్పటికీ భూగర్భజలాలు సాధారణ స్థాయికి చేరలేదు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో అతి తక్కువ భూగర్భ జలాలు ఉన్న జిల్లాల్లో రంగారెడ్డి నాలుగో స్థానంలో ఉంది. గతేడాది జులై 31తో పోలిస్తే ఈ ఏడాది జులై 31 నాటికి రంగారెడ్డి జిల్లాలో 4.12 మీటర్ల భూగర్భ నీటి మట్టం తగ్గింది. అలాగే వికారాబాద్‌లో దాదాపు 18 శాతం అధిక వర్షపాతం నమోదైనా 2.87 మీటర్ల నీటి మట్టాలు తక్కువగా నమోదయ్యాయి. ఇక మేడ్చల్ జిల్లాలోనూ గతేడాదితో పోలిస్తే 2.51 మీటర్లలోతులోనే భూగర్భ జలాలు ఉన్నాయి. భూగర్భజలాలు ఇంకా పెరగని కారణంగా విస్తారంగా వర్షాలు పడుతున్నా చెరువులు, కుంటల్లో నీరు కనిపించడం లేదు. రంగారెడ్డి జిల్లాలోని అతిపెద్ద జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లు కూడా పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోలేదు. గత ఏడాది ఇదే సమయానికి ఈ రెండు జలాశయాలు నిండడంతో గేట్లు ఎత్తి కిందకు నీరు వదిలారు. ఇంకా మిగతా ప్రాంతాల్లోని చెరువులు, కుంటల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇబ్రహీంపట్నం చెరువు కూడా ఇంకా నిండని పరిస్థితి. దాదాపు 2వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువులో నీరు ఇంకా కిందకు వదల్లేదు. గతేడాది నుంచి ఈ చెరువులో నీరు అలానే ఉంచడంతో ఏదో కొంత నీరు కనిపిస్తుంది. ఈ ఏడాది చెరువులోకి నీరు రాకపోవడంతో వేసవి నుంచి నీటిమట్టం ఒక్క అడుగు కూడా పెరగలేదు. 42 అడుగుల గరిష్ట నీటిమట్టం ఉన్న చెరువులో ఇపుడు 22 అడుగుల నీరు మాత్రమే ఉంది.

విచ్చలవిడిగా నీటి వినియోగం

వికారాబాద్ జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు, శివసాగర్ ప్రాజెక్టులు కూడా ఇంత వరకు నిండలేదు. ఇదిలా ఉండగా పలు ప్రాంతాల్లో విచ్చలవిడి నీటి వాడకంతో శరవేగంగా భూగర్భజలాలు తరిగిపోతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం వల్ల కొందరు రైతులు అవసరం లేకున్నా నీటిని తోడేస్తున్నారు. అనేక ప్రాంతాల్లో నిరంతరం వ్యవసాయ మోటార్లను వినియోగిస్తున్నారు. దీంతో పాటు పరిశ్రమలకు కూడా నీటి వినియోగం భారీగా పెరిగింది. హైదరాబాద్ చుట్టు పక్కల కాలనీలు పెరగడంతో పాటు, కొత్త పరిశ్రమలు వస్తుండడంతో శివారులో జనాభా గణనీయంగా పెరుగుతోంది. దీనికి అనుగుణంగా నీటి వినియోగం సైతం పెరిగింది. ఈ కారణంగా శరవేగంగా భూగర్భజలాలు పడిపోతున్నాయి. సాధారణ వర్షపాతం నమోదైనా భూగర్భజలాలు పెరగడం లేదు.

సాగు అంతంతమాత్రమే..

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు పెరగకపోవడం పంటల సాగుపె తీవ్ర ప్రభావం పడింది. పలు చోట్ల విస్తీరంగా వర్షాలు కురిసినా భూగర్భజలాలు అంతంత మాత్రంగా ఉండడంతో కురిసిన వర్షపు నీరంతా భూమిలోకి ఇంకుతోంది. దీంతో భూమిలో తేమ ఎక్కువ లేకపోవడంబతో రైతులు ఆశించిన స్థాయిలో పంటలు సాగు చేయలేకపోయారు. రంగారెడ్డి జిల్లాలో ఆగస్టు రెండో వారానికి కూడా సగం విస్తీర్ణంలో కూడా రైతులు సాగు చేయలేకపోయరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వికారాబాద్‌లో కొంత పరిస్థితి మెరుగ్గానే ఉంది. ఇక మేడ్చల్‌లోనూ అంతంతమాత్రంగానే పంటలు సాగు చేశారు.

వికారాబాద్‌లో అధిక వర్షం.. అయినా

ఈ ఏడాది వికారాబాద్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. వికారాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 352.7మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా దీనికి మించి 417.3 మి.మీ వర్షం కురిసింది. దాదాపు 18శాతం అధిక వర్షపాతం నమోదైంది. కానీ ఇక్కడ దాదాపు రెండున్నర శాతం భూగర్భజలాలు గతేడాది కంటే తక్కువగా ఉన్నాయి.

వర్షపాతం నమోదు (మి.మీలలో) జిల్లా	సగటు	కురిసింది	శాతం
రంగారెడ్డి	293.8	273.8	-7.0
వికారాబాద్	352.7	417.3	+18.0
మేడ్చల్	339.1	307.6	-9.0

సాగు విస్తీర్ణం (జిల్లాల వారీగా ఎకరాల్లో) జిల్లా	సాధారణం	ప్రస్తుతం	శాతం
రంగారెడ్డి	3,96,899	1,78,182	44.89
వికారాబాద్	5,77,508	4,39,939	76.18
మేడ్చల్	23,026	9,596	41.67

పత్తాలేని వానలు!

ముఖం చాటేసిన వరుణుడు

- ఎండుముఖం పడుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

పరిగి, ఆగస్టు 13: వానకాలం ప్రారంభమై రెండున్నర నెలలు గడస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. దీంతో సాగుపై తీవ్ర ప్రభావం పడింది. మృగశిర కార్తె రోజును మురిపించిన చిన్నపాటి వర్షాలు తిరిగి కానరాకుండా పోయాయి. అప్పట్లో కురిసిన వానకు విత్తుకున్న పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తి తడి అందక వాడిపోతున్నాయి. నల్లరేగడి భూముల్లో పంటలు కాస్త బాగున్నా ఎర్ర చెలక భూముల్లో పంటలు ఇప్పటికే ఎండుముఖం పట్టాయి. జూన్‌లో కురిసిన వర్షాలు, జూలైలో పత్తాలేకుండా పోయాయి. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నా పరిగి నియోజకవర్గంలో అసలే లేని పరిస్థితి. పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో పంటల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం పంటలకు ఎరువులు వేసే సమయం కాబట్టి వర్షం కురిస్తే ఆశాజనకంగా ఉండేది. ఇలాగే మరో వారం రోజులు వానాలు రాకపోతే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిగి సబ్ డివిజన్‌లోని పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో 200లకుపైగా చెరువు, కుంటలున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా పరిగిలో మాత్రం ఆశించిన వర్షాలు లేక తటాకాలు వెలవెలబోతున్నాయి. దీంతో చెరువుల కింద ఈ సారి కూడా పంట సాగుకు నోచుకునే పరిస్థితి. సబ్ డివిజన్‌లోని ప్రధానంగా లక్నాపూర్, అంతారం పాటిమీదు చెరువు, రాయన్‌చెరువు, ఇబ్రహింపూర్, దోమ పెద్దచెరువు, ఐనాపూర్, కిష్టాపూర్, ముజాహిద్, కులకచర్ల చెరువుల్లో నేటికీ నీరు చేరని పరిస్థితి.



దోమ మండలం బాసుపల్లిలో నీరు లేక వాడిన మొక్కజొన్న పంట



నీరు లేక వెలవెలబోతున్న తిమ్మాయిపల్లి చెరువు



ధారూరు పీఏసీఎస్‌లో యూరియా బస్తాలు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

వికారాబాద్, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత ఉందనే అపోహలకు రైతులు గురికావద్దని, జిల్లాలో వివిధ సంస్థల వద్ద 2135.95 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు సిద్ధంగా ఉందని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ తెలిపారు. అంతే కాకుండా మార్క్‌ఫెడ్ వద్ద 4723.160 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'యూరియా ఏదయా!' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ స్పందించారు. ఈ విడతకు సరిపడా యూరియా రైతులు కొనుగోలు చేయవచ్చన్నారు. సన్న యూరియా, దొడ్డు యూరియా పనితనంలో ఎలాంటి తేడా ఉండదని, ఈ రెండు రకాల యూరియాలు పనిచేసే విధానం ఒక్కటేనని ఆయన వివరించారు. ఫర్టిలైజర్ దుకాణదారులు తప్పనిసరిగా గరిష్ట చిల్లర ధరలకే ఈపాస్ మిషన్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాలని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల రైతులకు ఎరువులు విక్రయించకూడదని, ఇతర ఉత్పత్తులతో లింక్ చేసి అమ్మకూడదన్నారు. వ్యవసాయాధికారులు వారానికి ఆరు దుకాణాల వంతున తనిఖీ చేసి యాప్‌లో నమోదు చేస్తున్నారని, తనిఖీల్లో లోపాలు వెలుగులోకి వస్తే తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కొనుగోళ్లలో ఎలాంటి తప్పిదాలు తమ దృష్టికి వచ్చినా రైతులు సంబంధిత దుకాణదారులపై వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేస్తే వారు తగిన చర్యలు తీసుకుంటారని గోపాల్ స్పష్టం చేశారు.

ధారూరు పీఏసీఎస్‌కు రెండు లారీల యూరియా

ధారూరు: ధారూరు పీఏసీఎస్‌కు మంగళవారం మార్క్‌ఫెడ్ నుంచి రెండు లారీల యూరియా వచ్చిందని సంఘం సీఈవో నర్సింహులు తెలిపారు. పీఏసీఎస్‌కు 1,120 సంచుల యూరియా వచ్చిందన్నారు. ఇందులో 560 సంచులు నాగారం ఎరువుల కేంద్రానికి తరలించి రైతులకు పంపిణీ చేశామని వివరించారు. ఒక్కో రైతుకు 3సంచుల చొప్పున అందజేశామని ఆయన తెలిపారు.

ఘట్‌కేసర్‌లో భారీ వర్షం

ఘట్‌కేసర్, ఆగస్టు13: ఘట్‌కేసర్‌లో మంగళవారం భారీ వర్షం కురిసింది, దాదాపు నెలరోజుల నుంచి అప్పుడప్పుడు చిరుజల్లులు కురిసినప్పటికీ వాతావరణం ఎండాకాలాన్ని తలపించింది. నిత్యంఉక్కపోతతో జనాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మంగళవారం సాయంత్రం దాదాపు అర్ధగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాగా రైతులు మాత్రం సంతోషం వ్యక్తం చేశారు.



స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

- కొరత ఉన్న చోట్ల తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం
- 'కడా' పరిధిలోని 4 మండలాల్లోనే ఎంపిక

-7లో

సురక్షితమైన ఔషధాలనే తయారు చేయాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్
- జీనోమ్ వ్యాలీ బయోటెక్ ఫార్మా కంపెనీల సందర్శన

శామీర్‌పేట, ఆగస్టు 13 : ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపకుండా సురక్షితమైన ఔషధాలనే తయారు చేయాలని బయోటెక్ ఫార్మా కంపెనీలకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. మంగళవారం శామీర్‌పేట మండలం తుర్కపల్లి పరిధిలోని జీనోమ్‌వ్యాలీ బయోటెక్ ఫార్మా కంపెనీలను కలెక్టర్ సందర్శించారు. జీనోమ్‌వ్యాలీ పరిధిలోని భారత్ బయోటెక్, బయోలాజికల్ ఈ లిమిటెడ్, బయోటెక్ ఫార్మా కంపెనీలను కలెక్టర్ సందర్శించి ఔషధాల తయారీ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఔషధాలను తయారీలో క్రమబద్ధమైన పరిశోధనలు చేస్తూ, నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. జనాభాకు తగ్గట్టుగా ఔషధాలను ఉత్పత్తిపై దృష్టి సారించాలని ఫార్మా కంపెనీల యాజమాన్యాలు, అధికారులకు సూచించారు. నూతన ఔషధాల ఆవిష్కరణ విధానంలో చేస్తున్న పరిశోధనలను మరింత అభివృద్ధి పరచాలని సూచించారు. ఔషధాల తయారీలో భాగంగా డ్రగ్స్‌ను శుభ్రపర్చడం, స్టెరిలైజేషన్, నాన్ స్టెరిలైజేషన్, కాలుష్య నివారణ చర్యలు బాధ్యతగా చేపట్టాలన్నారు. ఔషధాల నిల్వ, రవాణ కోసం అంతర్జాతీయ ప్రమాణాలు, నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉద్యోగులకు అవసరమైన శిక్షణను ఇవ్వాలన్నారు. ఔషధాల ఉత్పత్తిని పెంచి పేదప్రజలకు వ్యయభారం కాకుండ చూడాలని ఫార్మా కంపెనీలకు కలెక్టర్ సూచించారు. కాగా బయోటెక్ కంపెనీలను పరిశీలనకు విచ్చేసిన కలెక్టర్ గౌతమ్‌ను యాజమాన్యం, అధికారులు అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్(డిఐసీ) ప్రశాంత్ కుమార్, చంద్రశేఖర్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ వెంకట శేఖర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు సాయికృష్ణ, జోనల్ మేనేజర్లు అనురాధ, వినయ్‌కుమార్, బయోటెక్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



బయోలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్/పరిగి, ఆగస్టు 13: లక్ష్యాలను అనుగుణంగా సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ మిల్లర్లకు సూచించారు. మంగళవారం కలెకరేట్‌లో సీఎంఆర్ డెలవరీలో ఆలస్యంపై రైస్‌మిల్లర్లు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. మిల్లు పట్టిన బియ్యాన్ని (సీఎంఆర్) ఎఫ్‌సీఐకి నిర్ణీత సమయంలో చేరవేయడంలో అలసత్వం వహించకూడదన్నారు. 2021 -22 వానాకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్‌ను సకాలంలో అందించాలని తెలిపారు. అదేవిధంగా 2022-23 వానాకాలం సీజన్‌కి సంబంధించి సెప్టెంబరు మొదటి వారంలోగా సీఎంఆర్‌ను ఇచ్చేలా మిల్లర్లు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మిల్లింగ్ అయ్యేలా డిప్యూటీ తహసీల్దార్లు తమ కార్యాచరణను రూపొందించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్, జిల్లా మేనేజర్ సుగుణ బాయ్, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, పౌర సరఫరాలడిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పరిగి తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో, ప్రజాపాలన కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డు రూమ్, రిజిస్ట్రేషన్ రూమ్, డేటా ఎంట్రీ రూమ్‌లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరన చేపట్టాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రజా పాలన దరఖాస్తులను ఎలా గుర్తించాలనే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్, ఎంపీడీవో ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

విధుల్లో చేరిన నాలుగు రోజులకే..

ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

పటాన్‌చెరులో జరిగిన కేసులో హన్మంతరావుపై చర్యలు



ఘట్‌కేసర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌కు నూతనంగా వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ హన్మంతరావుపై సస్పెన్షన్ వేటు పడింది. అయ్యారు. గత సోమవారం పటాన్‌చెరు నుంచి ఆయన ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. రెండు రోజులు ఆలస్యంగా ఘట్‌కేసర్ సబ్‌రిజిస్ట్రార్‌గా పదవి బాధ్యతలు చేపట్టారు. నాలుగు రోజులపాటు (గత శుక్రవారం వరకు) ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్ పని చేశారు. అయితే ఆయనను శుక్రవారం ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన విషయం ఆలస్యంగా మంగళవారం వెలుగుచూసింది. సబ్‌రిజిస్ట్రార్ హన్మంతరావు పటాన్‌చెరులో ఉన్నప్పుడు ఓవ్యక్తి నుంచి లంచం తీసుకున్న కేసులో అధికారులు విచారణ జరిపి ఆయనను సస్పెండ్ చేసినట్లు సమాచారం. కాగా ఘట్‌కేసర్‌లో కేవలం నాలుగురోజుల పాటే సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఆయన ఇక్కడి డాక్యుమెంట్ రైటర్లను వివిధ రకాలుగా ఇబ్బందులకు గురి చేశాడని పలువురు వాపోయారు. కేవలం నాలుగు రోజులకు పాత కేసులో సస్పెండ్ అయిన సబ్‌రిజిస్ట్రార్ ఉదంతం చర్చనీయాంశంగా మారింది.

ఉత్తముల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో 'ఉత్తమ ఉపాధ్యాయ-2024' ఎంపికకు అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో విజయకుమారి మంగళవారం తెలిపారు. సెప్టెంబరు 5న నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి, అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితిలో స్వీకరించం అని ఆమె పేర్కొన్నారు.

వ్యాపారులు వాహనదారులకు ఇబ్బంది కల్గించొద్దు

చేవెళ్ల, ఆగస్టు 13: రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకుంటున్న వారు వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలగకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. మంగళవారం చేవెళ్లలో రోడ్డు పక్కన పండ్లు, కూరగాయల దుకాణాదారులకు ట్రాఫిక్ ఇబ్బందులపై అవగాహన కల్పించారు. వినియోగదారులను ఎక్కువసేపు బండ్ల వద్ద నిలబెట్టుకోవద్దని, కొనుగోలుదారులు రోడ్డుపై వాహనాలు నిలపకుండా చూసుకోవాలన్నారు. అలాగే సాయంత్రం పామెన స్టేజీ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ రూల్స్‌పాటించాలని ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఆలయాల ప్రారంభోత్సవాలకు ఎంపీ అరుణకు ఆహ్వానం

కొత్తూర్, ఆగస్టు 13: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవతల ఆలయాల ప్రారంభ కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ మంగళవారం ఆలయాల కమిటీ సభ్యులు మహబూబ్‌నగర్‌కు వెళ్లి ఎంపీ డీకే అరుణకు ఆహ్వాన పత్రిక అందజేశారు. దాతల సహకారంతో మండల కేంద్రంలో 8 గ్రామ దేవతల ఆలయాలను అత్యాధునిక హంగులతో నిర్మించారు. ఈ నెల 16 నుంచి 23 వరకు ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు, పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు కడెంపల్లి సదానంద్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ జంగగళ్ల కృష్ణయ్య, వివిధ పార్టీల నాయకులు గోవిందరెడ్డి, మానుల లక్ష్మయ్య, కర్రోళ్ల సురేందర్ తదితరులు డీకే అరుణను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.


ఎంపీ డీకే అరుణకు ఆహ్వానాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13: ప్రధాని మోదీ ఇచ్చిన 'హర్ ఘర్ తిరంగా' పిలుపు మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నంలో బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్, బీజేవైఎం లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం మాట్లాడుతూ.. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలనేది ప్రధాని పిలుపు అని అన్నారు. దేశ ఐక్యతను పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరు ఇందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి, జంగయ్యగౌడ్, రవి, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వన్నవాడ రవీందర్‌రెడ్డి, రూపక్, విజయ్, ఐలేష్, మహేందర్, శుభర్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

- కొరత ఉన్న చోట్ల తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం
- 'కడా' పరిధిలోని నాలుగు మండలాల్లోనే ఎంపిక
- 52 పాఠశాలల్లో 54 మంది ఎంపికకు అనుమతి
- బడుల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు



వికారాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అనుమతిచ్చింది. వికారాబాద్ జిల్లాలో మొదట 85 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు అవసరమవుతారని గుర్తించగా, ఇప్పటి వరకు 'కడా' పరిధిలోని నాలుగు మండలాల్లోని 52పాఠశాలల్లో 54మంది నియామకానికి అనుమతిస్తూ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకాగా, గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. కొత్తవారు జాయిన్ అయ్యే వరకు పాత వారిని రిలీవ్ చేయడం లేదు. అయితే తమను బదిలీ చోటుకు పంపాలని ఉపాధ్యాయులు విద్యాశాఖపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో సరిపడినంత మంది ఉపాధ్యాయుల్లేక చదువులు సాగడం లేదు. ఉపాధ్యాయుల నియామకానికి ఇటీవల డీఎస్సీ నిర్వహించగా, సెప్టెంబరు 5న గురుపూజోత్సవం రోజున నియామకపత్రాలివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అప్పటి వరకు ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు చేపట్టనున్నారు. వికారాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని 4 మండలాల పరిధిలోని 52 పాఠశాలల్లో 54 మందిని నియమించేందుకు అనుమతిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారికి నెలకు రూ.15,600 గౌరవ వేతనం ఇస్తారు. మూడు నెలల కాలానికే అని అపాయింట్‌మెంట్ లెటర్లలో పేర్కొన్నా డీఎస్సీ నియామకాల వరకూ కొనసాగే అవకాశం ఉంది.

అర్హులు ఎవరంటే ..

స్కూల్ అసిస్టెంట్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు డిగ్రీ, బీఎడ్ విద్యార్హతలున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. అదే తెలుగు, హిందీ, ఉర్దూ పండిత్ పోస్టులకు డిగ్రీతో పాటు పండిత్ శిక్షణ పూర్తయిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఎంపీడీవో అధ్యక్షతన ఎంఈవో, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం, సంబంధిత పాఠశాల హెచ్ఎంలతో కమిటీలు ఏర్పాటు చేస్తారు. నియామక ప్రక్రియను ఈ నెల 15వ తేదీకల్లా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

'కడా' పరిధి పాఠశాలల్లోనే..

కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) పరిధి బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్ మండలాల్లో టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. బొంరాస్‌పేట్ మండలంలో రేగడి మైలారం, మహంతిపూర్, కొత్తూరు, లగచర్ల, ఎన్కేపల్లిల్లో 10 ఖాళీల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తారు. దౌల్తాబాద్ మండలం తిమ్మారెడ్డిపల్లి, నీటూరు, మాటూరు, దేవరఫస్లాబాద్, దౌల్తాబాద్, బాలంపేట్, బిచ్చాల్, సుల్తాన్‌పూర్, గుమ్డాల్లోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 21 పోస్టుల్లో ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. దుద్యాల్, హకీంపేట్, చిల్ముల్ మైల్వార్, దుద్యాల్ ఉర్దూ మీడియం, ఏర్పుమళ్ల పాఠశాలల్లో 12 మందిని నియమిస్తారు. కొడంగల్ మండలం హస్నాబాద్ ఉర్దూ మీడియం, అంగడి రాయిచూర్ ఉర్దూ మీడియం, అన్నారం, ఇందనూరు, టేకల్కోడ్, పర్సాపూర్, రుద్రారం, కొడంగల్, కస్తూర్‌పల్లి పాఠశాలల్లో 11 మందిని నియమించనున్నారు.

కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక

అకతడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాల్లో మొదట పాఠశాల ఉండే గ్రామ పంచాయతీ/మునిసిపల్ పరిధిలో నివాసం ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు. పంచాయతీ, మునిసిపాలిటీలో అభ్యర్థులు అందుబాటులో లేకపోతే సమీప పంచాయతీల వారికి ప్రాధాన్యం ఇస్తారు. అక్కడా అర్హులు దొరక్కపోతే మండలంలోని గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి విధులకు హాజరయ్యే అవకాశం ఉంది.

యూత్ వింగ్‌కు జవసత్వాలు

- యువజన కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు నాయకత్వం కసరత్తు
- ఎన్ఎస్‌యూఐ, గ్రామ కమిటీల బలోపేతానికి చర్యలు
- పీసీసీ కార్యాచరణ.. నేటి నుంచే సభ్యత్వ నమోదు



తాండూరు, ఆగస్టు 13 : కాంగ్రెస్ పార్టీ అనుబంధ యువజన విభాగానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. అధికారంలో కాంగ్రెస్ ఉండడం, సమీపంలో స్థానిక ఎన్నికలు రానుండడంతో అనుబంధ విభాగాల బలోపేతానికి పార్టీ రాష్ట్ర నేతలు సంకల్పించారు. రాష్ట్రస్థాయిలో యువజన విభాగ ఎన్నికలు ముగిసిన వెంటనే జిల్లా, మండల, నియోజకవర్గ కమిటీలకు ఎన్నికల నిర్వహణకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 14 నుంచి యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు మొదలు కానుంది. సెప్టెంబర్‌లో యూత్ వింగ్‌కు ఎన్నికలు నిర్వహిస్తారు. పార్టీ స్టూడెంట్ వింగ్ అయిన ఎన్ఎస్‌యూఐకి కూడా ఎన్నికలు పెట్టనున్నారు. తాండూరు డివిజన్‌లో తాండూరు, కొడంగల్ మున్సిపాలిటీలు, తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, కోటిపల్లి, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, మద్దూర్ రూరల్ మండలాలు ఉన్నాయి. గ్రామ/మండల కమిటీలు, నియోజకవర్గ కమిటీల ప్రక్రియ పూర్తయ్యాక జిల్లా కమిటీని ఎన్నుకుంటారు. లోక్ బాడీల ఎన్నికల దృష్ట్యా తాండూరు పురపాలిక పరిధిలో పార్టీ పదవులకు పోటీ ఎక్కువగానే ఉండనుంది. దీన్ని బేస్ చేసుకునే ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ, విజయం ఆధారపడి ఉండడంతో పార్టీ పదవులకు ముఖ్యంగా యూత్ వింగ్ పదవులకు యువజన కాంగ్రెస్ నాయకులు పోటీ పడనున్నారు. కాగా ఈ నెల 14(నేటి) నుంచి యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు మొదలు కానుంది. కార్యకర్తలతో సభ్యత్వాలు చేయించి వారితో యూత్ వింగ్ నాయకులను ఎన్నుకుంటారు. నియోజకవర్గం, గ్రామ యూనిట్లుగా సభ్యత్వాలు చేపడుతారు. జిల్లా కేంద్రంలో మంత్రులు, నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభిస్తారు. జిల్లాలో ఈ ప్రక్రియంతటినీ జిల్లా కాంగ్రెస్ కమిటీ పర్యవేక్షించనుంది. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పనిచేసిన వారికే పార్టీ పదవులు దక్కేలా చూడాలని డీసీసీలు, ఎమ్మెల్యేలకు పీసీసీ సమాచారం ఇచ్చింది. జిల్లా అధ్యక్షులు, కార్యవర్గాన్ని ఎన్నుకునే విషయంలో జిల్లాలోని ఎమ్మెల్యేందరితో సమన్వయం చేసుకొని ఎంపిక చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. నియోజకవర్గానికి ఒక పదవి చొప్పున యువజన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం ఉండేలా ప్రణాళిక అమలు చేయనున్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో చేసిన కృషిని కూడా లెక్కలోకి తీసుకోనున్నారు.

పేదల భూములను పెట్టుబడిదారులకు దోచిపెట్టొద్దు

- అభివృద్ధి పేరుతో ఫార్మా కంపెనీలకు ధారాదత్తం చేయొద్దు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు


భూ సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రాములు

కొడంగల్, ఆగస్టు 13: అభివృద్ధి పేరుతో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు, పేదల భూములను పెట్టుబడిదారులకు దోచిపెట్టడం సరికాదని, అభివృద్ధి నమూనా అంటే ఇదేనా? అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. మంగళవారం కొడంగల్‌లోని రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట్రాములు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా భూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఫార్మా కంపెనీ పేరుతో హకీంపేట్, లగచర్ల, పోలెపల్లి, పులిచర్ల, రోటిబండతండాల్లో 1,274 ఎకరాలు, కొడంగల్ మండలం ఎరన్‌పల్లిలో 74 ఎకరాలు మెడికల్, నర్సింగ్ కళాశాలలకు ప్రభుత్వం పేదల భూములను లాక్కోవడం దుర్మార్గం అన్నారు. తాము నియోజకవర్గ అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు. కానీ రైతుల భూములను పెట్టుబడిదారులకు, ఫార్మా కంపెనీలకు అప్పజెప్పడం సరైంది కాదన్నారు. కొడంగల్ ప్రాంతంలో 1,156 ఎకరాల సీలింగ్ భూముల్లో ఫ్యాక్టరీలు, ఇతర సంస్థలను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘాల నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, యు.రమేశ్‌బాబు, బాలు, శ్రీనివాస్, మల్కయ్య, సుదర్శన్, సతీశ్, శ్రీనివాస్, సత్తయ్య, రఘురామ్, రైతులు మల్లికార్జున్, గోపాల్‌నాయక్, బసప్ప, యాదయ్య, శివకుమార్, సేవ్యానాయక్, రాములు, అనంతయ్య, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

యేటా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

శంకర్‌పల్లి, ఆగస్టు 13: ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి తప్పనిసరిగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్ తెలిపారు. శంకర్‌పల్లిలోని ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఇండియన్ కేన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ క్యాంప్‌ను నిర్వహించారు. అయన మాట్లాడుతూ 35సంవత్సరాలు నిండిన వారు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు. గుట్కాలు, పొగ, మద్యం తాగే అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం, కేన్సర్ సొసైటీలు నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 135 మందికి కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఐదుగురికి నోటి కేన్సర్ లక్షణాలు, 21మందికి సర్వైకల్ కేన్సర్ లక్షణాలు, ఒకరికి రొమ్ము కేన్సర్ లక్షణాలున్నట్లు గుర్తించామన్నారు. వీరందరినీ చికిత్స నిమిత్తం నగరంలోని కేన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీ ప్రాజెక్టు అధికారి రాకేశ్, వైద్యాధికారులు రేవతి, శ్రీనివాస్. సీహెచ్‌వో సం తోష, ఎమ్ఎల్‌హెచ్‌పీ వైద్యులు అనూష, ప్రియాసింగ్, రఘు, వైద్య సిబ్బంది మన్సూర్, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవాలకు కోట్‌పల్లి టీచర్, విద్యార్థి


ఢిల్లీ బయలుదేరుతున్న లక్ష్మణ్, సాయిచరణ్

బంట్వారం(కోట్‌పల్లి),ఆగస్టు 13: కోట్‌పల్లిలోని జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ్, అదే పాఠశాల విద్యార్థి సాయిచరణ్‌లకు ఈ నెల 15న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నుంచి సాయిచరణ్ ప్రశంసాపత్రం అందుకోనున్నారు. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థుల ఎంపికలో సాయిచరణ్ ఎంపికయ్యాడు.లక్ష్మణ్, సాయిచరణ్‌లు మంగళవారం హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

పర్యటన విజయవంతం

సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిల అమెరికా పర్యటన మంగళవారం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా వారు ప్రపంచంలో పేరొందిన కంపెనీల యాజమాన్యాలతో అక్కడ చర్చలు జరిపారు. నేడు స్వదేశానికి రానున్నారు.

- పరిగి, ఆగస్టు 13



లక్ష్మప్పకు ఉత్తమ లైబ్రేరియన్ పురస్కారం


అవార్డు అందుకుంటున్న లక్ష్మప్ప

వికారాబాద్, ఆగస్టు 13: వికారాబాద్‌లోని జిల్లా గ్రంథాలయ గ్రంథ పాలకుడు ఎం.లక్ష్మప్ప రాష్ట్ర ఉత్తమ లైబ్రేరియన్ పురస్కారానికి ఎంపికయ్యారు. జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు రియాజ్ నుంచి లక్ష్మప్ప ఉత్తమ లైబ్రేరియన్ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ డైరెక్టర్ ఏవీఎన్.రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మప్ప మాట్లాడుతూ.. తనకు రాష్ట్ర ఉత్తమ గ్రంథపాలకుడి అవార్డు దక్కడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని, పాఠకులకు, విద్యార్థులకు మరిన్ని ఉత్తమ సేవలందించేలా కృషిచేస్తానన్నారు. తనను పురస్కారానికి ఎంపిక చేసిన కమిటీ సభ్యులకు, పురస్కార ప్రదాతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

స్కూల్ గేమ్స్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా అనంతయ్య


అనంతయ్య

వికారాబాద్, ఆగస్టు 13: స్కూల్ గేమ్స్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా అగ్గనూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సి.అనంతయ్యను నియమించారు. ఈమేరకు జిల్లా విద్యాధికారి జి.రేణుకాదేవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024-26 విద్యా సంవత్సరాలకు సంబంధించి రెండేళ్ల పాటు అనంతయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొనసాగనున్నారు. ఆయన పర్యవేక్షణలో స్కూల్ గేమ్స్ జరగనున్నాయి.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


ప్రభుత్వభూమిలో నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఘట్‌కేసర్, ఆగస్టు13: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ రెవెన్యూలోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. యంనంపేట్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 91లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సిబ్బందితో వెళ్లి నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈసందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.25లక్షలతో సీసీ రోడ్డు పనులు


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 13 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్జీవో కాలనీలో రూ.25లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు పనులు చేపట్టామని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో 16వ వార్డు ఎన్జీవో కాలనీలో నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి, స్థానిక కౌన్సిలర్ ఉమానాగరాజు, బీఆర్ఎస్ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో హిందీ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, ఆగస్టు 13: బషీరాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో హిందీ(హెచ్‌బీటీ) పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అల్తామాస్ జహంగీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీఈడీతో పాటు హిందీ మెథడ్ ఉన్న వారు ఈపోస్టుకు అర్హులని తెలిపారు. ఈనెల 20వ తేదీ లోపు స్థానిక మోడల్‌స్కూల్‌లో స్వయంగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలల సమయానికి బస్సులను నడపాలి

కొడంగల్ రూరల్, ఆగస్టు 13: పాఠశాలల, కళాశాలల సమయానికి బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అన్నారు. కొడంగల్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్కేపల్లి గ్రామం నుంచి కొడంగల్ మండల కేంద్రానికి ప్రతి రోజు దాదాపు 100మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసించడానికి వస్తున్నారు. ఆ గ్రామానికి బస్సు సౌకర్యంలేక పోవడంతో విద్యార్థులను ఆటోల్లో పరిమితికి మించి ఎక్కించుకుని నడుపుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులకు ఆటోచార్జీలు భారమవుతున్నాయన్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

దామగుండం ప్రాజెక్ట్‌ను వెనక్కి తీసుకోవాలి

వికారాబాద్, ఆగస్టు 13: అనంతగిరి కొండల్లోని దామగుండం అటవీ ప్రాంతంలో భారత నౌకాదళానికి వెరీలో ఫ్రీక్వెన్సీ(వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్ కోసం కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని జేఏసీ మాజీ జిల్లా చైర్మన్ కె.శ్రీనివాస్, పూడూరు మాజీ ఎంపీపీ మల్లేశం, టీఆర్ఎస్ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ కన్వీనర్ రవిబాబులు పేర్కొన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వై. మహేందర్ ఆధ్వర్యంలో స్థానిక క్లబ్‌లో మంగళవారంచర్చ వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, శివరాజ్, రామన్న, శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, రుచిత పాల్గొన్నారు.

పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

దోమ, ఆగస్టు 13: రైతులు సాగు చేసే పంటలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పరిగి వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీకుమారి అన్నారు. మండలంలోని బొంపల్లిలో రైతుల పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. రైతు రుణమాఫీపై రైతులతో చర్చించారు.

ఆలయానికి రూ.10లక్షల ప్రొసీడింగ్

తాండూరు, ఆగస్టు 13: చేర్వేంటి ఈశ్వర ఆలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి రూ.10లక్షలు మంజూరు చేస్తూ ఆలయ కమిటీకి మంగళవారం ప్రొసీడింగ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, ఆలయ మిటీ అధ్యక్షుడు శాంత్‌కుమార్, కార్యదర్శి బస్వరాజ్ పాల్గొన్నారు.

పేదల భూముల్లో మైనింగ్ వెంటనే ఆపాలి

పూడూరు, ఆగస్టు 13 : ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూముల్లో అక్రమంగా మైనింగ్ కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని సీపీఎం రాష్ట్ర కమిటీ వెంకట్ రాములు పేర్కొన్నారు. పూడూరు మండల పరిధిలోని మిర్జాపూర్ గ్రామంలో మంగళవారం ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూముల్లో సీపీఎం నాయకులు పర్యటించారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి


మోమిన్‌కుర్దు పాఠశాలలో విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీవో

ధారూరు, ఆగస్టు 13: పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీవో నర్సింహులు సూచించారు. మోమిన్ కుర్దు పాఠశాలను మంగళవారం ఎంపీడీవో నర్సింహులు తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించి పనుల పురోగతిపై హెచ్‌ఎం నర్సింహులును ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి వంట కాల రుచి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ చక్రపాణి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 13: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మల్కాజ్‌గిరి ఏసీపీ ఎస్.చక్రపాణి విద్యార్థులకు సూచించారు. మండలంలోని ఎదులాబాద్ మెగా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన యాంటి డ్రగ్స్, యాంటి ర్యాగింగ్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, వీడియో కాల్స్, వ్యక్తిగత డేటా షేర్ చేయకూడదని విద్యార్థులకు సూచించారు. మత్తుపదార్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, క్రమశిక్షణతో చదువు కోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, జీవితంలో విజయలక్ష్యాలకు చేరుకోవాలన్నారు. ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టాలన్నారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఆపద వచ్చినా 100కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమేష్, సీఐ సైదులు, ఎస్ఐ శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ పట్నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి


ఘట్‌కేసర్: హాజరుపట్టికను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి

ఘట్‌కేసర్, ఆగస్టు 13: ప్రతీఒక్కరు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి పీహెచ్‌సీ లో మంగళవారం కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి ఆస్పత్రిని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం ఇండియన్ క్యాన్సర్ సొసైటీ మ్యాగ్నా కార్ప్ఫౌండేషన్ వారి సహకారంతో చేపట్టిన కేన్సర్ పరీక్షా శిబిరం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చిన మహిళలకు పరీక్షలు నిర్వహించి 20 మంది అనుమానితులను పరీక్షల నిమిత్తం క్యాన్సర్ ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు వైద్యాధికారి శోభన తెలిపారు.

ధారూరు: ధారూరు పీహెచ్‌సీలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, ఇండియన్ కేన్సర్ సొసైటీ, మ్యాగ్న ఫౌండేషన్లు సంయుక్తంగా కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 108మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ఇందులో నలుగురు పురుషులకు, ఇద్దరు స్త్రీలలో కాన్సర్ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించి పూర్తిస్థాయి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు బుచ్చిబాబు, నిరోషా, స్వాతి, విద్య తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యురాలు సుజల జయ్ 111 మందికి ఉచితంగా కేన్సర్ పరీక్షలు నిర్వహించారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలి


జాతీయ జెండాలతో మున్సిపల్ కార్మికులు

తాండూరు, ఆగస్టు 13: ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు నాగారం మల్లేశం అన్నారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులను సన్మానించి వారికి జాతీయ జెండాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాహ్రం శ్రీలత, జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

వికారాబాద్: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా దేశప్రధాని మోదీ పిలుపు మేరకు బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్కూటీ ర్యాలీ నిర్వహించినట్లు బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు యాస్కి శిరీష తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఎంఆర్‌పీ చౌరస్తా వరకు స్కూటీలపై జాతీయ జెండాలను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ నాయకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కీసర రూరల్: ప్రతీ భారతీయ పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి సత్యనారాయణ కాలనీలో మంగళవారం మేడ్చల్ రూరల్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీందర్ రెడ్డి, కిషోర్, అక్కాల సురేష్, జూపల్లి నరేష్, సూర్యశేఖర్‌రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.


వికారాబాద్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ మహిళా మోర్చా నాయకురాళ్లు

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి


బషీరాబాద్: బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్ఐ రమేష్‌కుమార్

బషీరాబాద్, ఆగస్టు 13: విధి నిర్వహణలో ప్రజలకు ఉత్తమ సేవలందించాలని ఎస్ఐ రమేష్ కుమార్ అన్నారు. బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ వేణుగోపాల్, కానిస్టేబుళ్లు చిన్నయ్య, శంకర్, రాందాస్, శ్రీనివాస్, జావీద్‌లకు స్థానిక ఎస్ఐ రమేష్‌కుమార్ మంగళవారం ఘన సన్మానం చేసి వీడ్కోలు పలికారు.ప్రజల రక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

పెద్దేముల్: బదిలీపై వెళ్లిన ఏఎస్ఐ నారాయణను పెద్దేముల్ పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో నారాయణ ఏఎస్ఐగా మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన పెద్దేముల్ నుంచి బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అందుకోసం ఆయనకు పెద్దేముల్ ఎస్ఐ గిరితో పాటు తోటి పోలీసు సిబ్బంది ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించి పూలమాలలు, శాలువాలతో ఆయనను సన్మానించారు.

యాలాల: యలాల పోలీస్ స్టేషన్ ఆవరణలో బదిలీపై వెళ్లిన ఏఎస్ఐ రాజశేఖర్, డబ్ల్యూహె చ్‌సి నర్సింహా, డబ్ల్యూ పీసీ అమృత, పీసీ శ్రీకాంత్, పీసీ శ్రీశైలంలకు ఎస్ఐ శంకర్ మంగళవారం సన్మానించారు.

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్ పంచాయతీలో కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేసి బదిలీపై వెళ్లిన నాగప్రసాద్‌ను తాజా మాజీ సర్పంచ్ ఎం.నర్సిరెడ్డి, స్థానికులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు చెరుకు రాజుగౌడ్, స్థానిక నాయకుడు కృష్ణమూర్తి, హెచ్‌ఎం అంబాదాస్ పాల్గొన్నారు.

పూడూరు: చెన్‌గోముల్ పాఠశాలలో ఉపాధ్యాయులు స్వరూపా, హెచ్‌ఎం రాజు, ప్రభాకర్, అంజనేయులు, శ్రీనివాస్, జయంతి, ఫాహన్ బదిలీపై వెళ్లగా, నూతనంగా పదిమంది ఉపాధ్యాయులు వచ్చారు. వీరిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

● **కొడంగల్ రూరల్:** కొడంగల్ నూతన ఎస్ఐ సత్యనారాయణను కొడంగల్ పట్టణానికి చెందిన డిస్ట్రిక్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబరు కె.దస్తప్ప తదితరులు మంగళవారం సన్మానించారు.

● **తాండూరు రూరల్:** కరన్‌కోట్ పాఠశాల ఉపాధ్యాయురాలు అనూష ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో ఆమె తాను ప్రాథమిక విద్యను అభ్యసించిన మండలంలోని చిట్టిఘనాపూర్ పాఠశాలపై అభిమానంతో మంగళవారం రూ.6వేలు వెచ్చించి మినీ సౌండ్ సిస్టంను అందజేశారు.

హోటల్‌కు జరిమానా

ఘట్‌కేసర్, ఆగస్టు 13: స్థానికంగా ఉన్న అన్నపూర్ణ హోటల్‌పై మున్సిపల్ అధికారులు దాడిచేసి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకులకు జరిమానా విధించారు. హోటల్‌లోని కిచెన్‌లో అపరిశుభ్రత వాతావరణం ఉందని పురుగులు పట్టిన ఆహారం పెడుతున్నారని స్థానికుడు ఇచ్చిన ఫిర్యాదుతో అన్నపూర్ణ హోటల్‌పై దాడి నిర్వహించినట్లు తెలిపారు. హోటల్ వంటగది అపరిశుభ్రంగా ఉండగా, ప్లాస్టిక్ కవర్లను పెద్దఎత్తున వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు హోటల్ నిర్వాహకులకు రూ.8వేలు జరిమానా విధించారు.

కార్మికులకు హ్యాట్సాఫ్!

తాండూరు, ఆగస్టు 13: ప్రాణాలను సైతం లెక్క చేయకుండా డ్రైనేజీలు శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.


మురుగును తొలగిస్తున్న రాములు

తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని మంగళవారం రాజీవ్ గృహ కాలనీలో సాయిపూర్‌లోని 11వ వార్డులో మురుగు పారడానికి వీలులేని స్థితిలో చెత్త పేరుకుపోవడంతో కాలనీలు దుర్గంధంలో నిండాయి. మున్సిపల్ జవాన్లు సీహెచ్ అశోక్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు హన్మంతు, డి.రాములు, వెంకటయ్య మ్యాన్ హోల్‌ను గంటల తరబడి పనిచేసి పేరుకుపోయిన్నింటిని కష్టపడి శుభ్రం చేశారు. ఇంత కష్టపడి పని చేస్తున్న కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.


మురుగును తొలగిస్తున్న వెంకటయ్య

సంక్షిప్తంగా..

● **బంట్వారం (కోట్‌పల్లి):** స్థానిక బస్టాండ్ సమీపంలో టీజీఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్‌ను ఆర్టీసీ అధికారులు మంగళవారం ప్రారంభించారు. కౌంటర్ ఏజెంట్‌గా భాశెట్టిని నియమించినట్లు లాజిస్టిక్ అధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

● **కులకచర్ల:** ముజాహిద్‌పూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థి చరణ్‌కుమార్ స్పోర్ట్స్ కోటాలో ఇబ్రహింపట్నం శ్రీ హిందు ఇంజనీరింగ్ కళాశాలలో సీఈసీలో ఇంజనీరింగ్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా అధ్యాపకులు మంగళవారం సన్మానించారు.

● **కులకచర్ల:** మండలం నుంచి ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి భారీగా హైదరాబాద్‌కు తరలి వెళ్లారు. మంగళవారం రాష్ట్ర దళిత సంఘాల నాయకులు సొసైటీ చైర్మన్ మొగులయ్య, మండల దళిత సంఘం పరిగి బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు.

● **ఘట్‌కేసర్:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, శానిటేషన్ విభాగాలపై పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

● **మూడుచింతలపల్లి:** మండలంలోని లక్ష్మాపూర్, మూడు చింతలపల్లి, అనంతారం గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో సీఎస్ఆర్ మేనేజర్ అనూష సూర్యానేని, కోఆర్డినేటర్ విజయలక్ష్మి మంగళవారం సపోర్ట్ సర్వీసెస్‌ను ప్రారంభించారు.

● **దౌల్తాబాద్:** స్థానిక ఎస్బీఐ బ్యాంకును జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ మంగళవారం సందర్శించారు. పంట రుణమాఫీపై శాఖ మేనేజర్‌తో చర్చించారు.

● **బంట్వారం:** టీఎస్ఎంఎస్టీఎఫ్ పిలుపు మేరకు ఈనెల 21న జరిగే తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ సంఘం శాంతియుత నిరసనను విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య, జిల్లా అధ్యక్షుడు జహంగీర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **పరిగి:** జాఫర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య మంగళవారం విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు పంపిణీ చేశారు.

● **మేడ్చల్ టౌన్:** శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శుభకార్యాల కోసం, ఇతర తీర్థయాత్రల కోసం ప్రత్యేకంగా బస్సులు బుక్ చేసుకునే ప్రయాణికులకు 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ మేడ్చల్ డీఎం సుధాకర్ తెలిపారు. సెప్టెంబర్ 3వ తేదీ వరకు వరకు అవకాశం ఉంటుందన్నారు.

● **శామీర్‌పేట:** శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ ఎంపీపీ జాలిగామ లత, రమేష్ దంపతులు, జాలిగామ నర్సింలుగౌడ్, సక్కమ్మ దంపతులు అన్నదానం చేశారు.

● **తాండూరు రూరల్:** స్పైస్ హోటల్ యజమాని మనోహర్ యాదవ్ కుటుంబ సభ్యులు మంగళవారం పేద విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేశారు.

● **బొంరాస్‌పేట్/కొడంగల్/నవాబుపేట:** బంగ్లాదేశ్‌లో హిందూ ఆలయాలపై దాడులను నిరసిస్తూ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. బొంరాస్‌పేట్, కొడంగల్, నవాబుపేట మండల కేంద్రాల్లో హిందూ సంఘాల నాయకులు ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు.

● **కొడంగల్/బొంరాస్‌పేట్:** కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి బుధవారం నియోజకవర్గంలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండలంలోని కొత్తూర్, లింగన్‌పల్లి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్ మంగళవారం ఓప్రకటనలో పేర్కొన్నారు.

● **శామీర్‌పేట:** శ్రీవీరభద్ర స్వామి దేవాలయాన్ని కట్టమైసమ్మ ఆలయ కమిటీ వారు పునఃనిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా బొమ్మరాశిపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్ రూ.1,01,000 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అశోక్, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

3.34 కిలోల గంజాయి పట్టివేత

● నిందితుడి రిమాండ్


ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం సాయంత్రం రాంపల్లి- చెంగిచెర్ల రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పద స్థితిలో వస్తున్న బైక్‌ను ఆపి సోదా చేశారు. అందులో 3.34 కిలోల గంజాయిని గుర్తించారు. వరంగల్ జిల్లా నర్సింహులుపేట, దుబ్బతండాకు చెందిన జటోతు రమేష్ మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లిలో ఉంటున్నాడు. ఇతడు గతంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఆ తర్వాత గంజాయి విక్రయాలు మొదలుపెట్టాడు. తక్కువ ధరకు ఒడిస్సా సరిహద్దు నుంచి గంజాయిని తీసుకొచ్చి రాంపల్లి, ఈసీఐఎల్ ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ మేరకు అతడి వద్ద నుంచి గంజాయితో పాటు బైక్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జటోతు రమేష్‌ను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

రైలు ఢీకొని 40 మేకలు మృత్యువాత

● జాడలేని మరో 20 మేకలు


రైలుపట్టాలపై మృత్యువాతపడిన మేకలు

ధారూరు, ఆగస్టు 13: గుర్తుతెలియని రైలు ఢీకొని 40మేకలు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన పాత రైల్వేగేట్ సమీపంలోని మదనంతాపూర్ మైసమ్మ బ్రిడ్జి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెల్పిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. డీకే తండాకు చెందిన చంద్రిబాయి, కిష్టిబాయి, బాల్‌రాజ్ నాయక్, తేజ్యానాయక్, పూల్‌సింగ్‌లకు చెందిన దాదాపు 60మేకల మందను మంగళవారం మేత మేపటానికి అడవిలోకి తీసుకెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా పాత రైల్వేగేట్ సమీపంలోని మదనంతాపూర్ మైసమ్మబ్రిడ్జి వద్ద మేకల మంద అడవి పందికి బెదిరిపోయి రైలుపట్టాల వెంబడి పరిగెత్తాయి. అదేసమయంలో రెండు గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మందలోని 40మేకలు మృత్యువాతపడగా రైలుపట్టాలపై చెల్లాచెదురుగా పడిపోయాయి. మిగిలిన మరో 20మేకల జాడ తెలియడం లేదు. విషయం తెలుసుకున్న తండావాసులు మృతిచెందిన మేకలను చూసి రోధించారు. ఈ మేకల విలువ రూ.4లక్షలు ఉంటుందని తండావాసులు తెలిపారు. మేకల కళేబరాలను తండావాసులు తొలగించి తీసికెళ్లారు. రెండు రైళ్లు మేకల మందను ఢీకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

పొలం దక్కకుండా చేస్తున్నారని పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం


ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్

వికారాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమ వ్యవసాయ పొలం తమకు దక్కకుండా చేస్తున్నారని తీవ్ర మనస్థాపం చెందిన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన పూడూరు మండలం చెన్‌గోముల్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్‌గోముల్‌కు చెందిన బందెయ్య అనే రైతుకు అదే గ్రామంలో ఒకటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ పొలంపై కన్నేసిన ఆ గ్రామానికి చెందిన కొందరు బందెయ్యను తీవ్రఇబ్బందులకు గురిచేస్తున్నారు. బందెయ్యకు ఉన్న ఒకటిన్నర ఎకరాల్లో ఒక ఎకరాలో పంటలు సాగు చేయనీయకుండా అడ్డుకోవడంతో అరఎకరాలో మాత్రం పత్తిపంట సాగుచేశారు. ఆపొలాన్ని కూడా ఆక్రమించుకునేందుకు బందెయ్య తీవ్రప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆ గ్రామానికి చెందిన కొందరు మంగళవారం బందెయ్య పత్తి పంటపై మంగళవారం గడ్డిమందు చల్లారు. విషయం తెలిసిన బందెయ్య పొలానికి వెళ్లగా అక్కడ అప్పటికే ఉన్న కొందరు బందెయ్యతో పాటు అతడి కుమారుడు శ్రీకాంత్‌తో వాగ్వాదానికి దిగి రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. తన సమస్యను పరిష్కరించాలని హైదరాబాద్‌లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకపోవడంతో మనోవేదనతో బందెయ్య కుమారుడు శ్రీకాంత్ పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

సైబర్ నేరగాళ్ల వలలో వ్యక్తి

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 13: తమ ఖాతాలో డబ్బులు జమచేస్తే ఎక్కువ పెట్టుబడులు వస్తాయని నమ్మించి డబ్బులు పోగొట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌కు చెందిన అక్తరుల్ హోక్(27 సంవత్సరాలు) ఫోన్‌కు గతేడాది 15 అక్టోబర్ 2023లో టెలిగ్రాం ఐడీ నుంచి తమ ఖాతాలో డబ్బులు జమచేస్తే ఎక్కువ పెట్టుడులు పొందవచ్చని అజ్ఞాత వ్యక్తి నుంచి సమాచారం వచ్చింది. దీంతో అక్తరుల్ హోక్ ముందుగా అతడి ఖాతాకు రూ.20వేలు పంపించాడు. మరింత పెట్టుబడి పెడితే ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పడంతో మరో రూ.25వేలు పంపించాడు. ఇలా దశలవారీగా ఒకసారి రూ.65వేలు, మరోసారి రూ.5వేలు, ఇంకోసారి రూ.25వేలు పంపాడు. మొత్తంగా రూ.లక్షా 35వేలు డిపాజిట్ చేశాడు. మరిన్ని డబ్బులు వేయాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి అక్తరుల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చోరీకి గురైన మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

ధారూరు, ఆగస్టు 13: ధారూరు కూరగాయ మార్కెట్‌లో సంత రోజు చోరీకి గురైన మూడు సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించామని ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ మంగళవారం తెలిపారు. గురుదోట్ల గ్రామానికి చెందిన రాములు, నాగసాన్‌పల్లికి చెందిన నర్సింహులు, వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామానికి చెందిన శశికల రెడ్డిల సెల్‌ఫోన్లు ధారూరు కూరగాయల సంతలో చోరీ అయ్యాయి. వీరి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పరిజ్ఞానంతో సెల్‌ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుని వారికి అప్పగించామని ఎస్ఐ చెప్పారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం


వెంకటేష్

మూడుచింతలపల్లి, ఆగస్టు 13: వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. శామీర్‌పేట్, పోచారం పరిధిలో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. శామీర్‌పేట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మరాశిపేట గ్రామానికి చెందిన వెంకటేష్ (22)ట్రాక్టర్ డ్రైవర్‌గా కాగా ఈనెల 12వ తేదీన పనికి వెళ్లాడు. సాయంత్రమైన ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పరిసరాలతో పాటు బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అదేవిధంగా బొమ్మరాశిపేటకు చెందిన సాజియా(19) కంప్యూటర్ క్లాస్‌కు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పరిసర ప్రాంతాలను వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సాజియా

పోచారం పరిధిలో ప్రైవేటు బ్యాంక్ డిప్యూటీ మేనేజర్..


గోగికార్ సంతోష్

ఘట్‌కేసర్ రూరల్: ఓ ప్రైవేటు బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ అదృశ్యమైన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మెహదీపట్నం, గుడిమల్కాపూర్‌కు చెందిన గోగికార్ సంతోష్(35) పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్‌లోని యాక్సిస్ బ్యాంక్‌లో డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 12వ తేదీన ఉదయం బ్యాంక్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకు వచ్చాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబసభ్యులు తెలిసిన వారిని, మిత్రులను విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. సంతోష్‌కు భార్య దీపిక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.